

పార్లమెంట్ తొలి వరుసలో రామ్మోహన్ నాయుడు



రామ్మోహన్ నాయుడు


ప్రజాశక్తి- శ్రీకాకుళం

చిన్న వయసులోనే పార్లమెంటులో ముందు వరుసలో కూర్చునే అరుదైన రికార్డును కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ రికార్డు తన తండ్రి కింజరాపు ఎర్రనాయుడు పేరున ఉంది. దీనిని రామ్మోహన్ నాయుడు తిరగరాశారు. కేంద్ర కేబినెట్‌లో ముఖ్యమైన శాఖలకు మాత్రమే దక్కే ఈ ఘనత దక్కడంపై ఆయన స్పందించారు. తెలుగు వారికి, శ్రీకాకుళం ప్రజలకు దక్కిన గౌరవంగా దీనిని అభివర్ణించారు.

సాగునీటి పోరు వాయిదా

నిరాశలో ఆశావహులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు మరోసారి ఆటంకం ఏర్పడింది. ఈ నెల ఐదో తేదీన విడుదల చేయాల్సిన ఎన్నికల నోటిఫికేషన్ వాయిదా పడింది. ఇప్పటికే ఈ ఎన్నికలు నవంబరు 21 జరగాల్సి ఉండగా, అనూహ్యంగా ఆఖరి నిమిషంలో వాయిదా పడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో ఎన్నికలు ఆగాయి. శాసనసభా సమావేశాలు ముగియడంతో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించి ఈ నెల ఐదో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సిద్ధమైంది. అంతలోనే మరోసారి వాయిదా పడ్డాయి. భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా వేసినట్లు ప్రభుత్వ ప్రకటించింది.



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సాగునీటి సంఘాలకు సాఫీగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో రెండు ప్రాజెక్టు వంశధార, నారాయణపురం వాటర్ యూజర్స్ కమిటీలు, 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. వీటితో పాటు మైనర్ వాటర్ యూజర్ అసోసియేషన్లు 250, మేజర్ వాటర్ యూజర్ అసోసియేషన్లు 94 ఉన్నాయి. జిల్లాలో మీడియం వాటర్ యూజర్స్ అసోసియేషన్స్ ఏమీ లేవు. వీటిలో వాటర్ యూజర్స్ అసోసియేషన్లకు ఈ నెల ఎనిమిదో తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నిక సైతం అదే రోజున జరనుంది. 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీ, 14న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలోని ఓటర్ల జాబితాలను ఇప్పటికే తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. జిల్లాకు సంబంధించి మొత్తం మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు మంది, మహిళా ఓటర్లు మంది ఉన్నారు.

ఎన్నిక ప్రక్రియ సాగేదిలా...

ఓటర్లయిన రైతులంతా కలిసి వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యూయుఎ) సభ్యులను ఎన్నుకుంటారు. జిల్లాలో మేజర్, మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీలో 12 మంది సభ్యులు ఎన్నికవుతారు. మైనర్ వాటర్ యూజర్స్ అసోసియేషన్‌లో ఆరుగురు ఎన్నిక కానున్నారు. ప్రతి కమిటీ నుంచి ఎన్నికైన సభ్యులంతా అందులో ఇద్దరిని ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకుంటారు. యూజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్లుగా ఎన్నికైన వారంతా జిల్లాలోని 21 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించిన ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌లను ఎన్నుకుంటారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ ప్రెసిడెంట్లంతా కలిసి వంశధార, నారాయణపురం ప్రాజెక్టులకు సంబంధించిన చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఓటర్లు చేతులెత్తే ప్రక్రియ ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడైన గందరగోళం ఏర్పడి ఎన్నిక జరగకపోతే ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకు సాగుతారు.

పదవులపై కూటమి నాయకుల దృష్టి

ప్రభుత్వం అధికారంలో ఉండటంతో కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు సాగునీటి సంఘాల పదవులపై ఆసక్తి కనబరుస్తున్నారు. సాగునీటి సంఘాలకు రాజకీయ పార్టీలతో సంబంధం లేకపోయినా తమ పార్టీ నాయకులే పదవులు దక్కించుకునే కూటమి నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. 2014-19 కాలంలో జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికల్లో కేవలం టిడిపి సానుభూతిపరులు మాత్రమే దక్కించుకోగా, ఇప్పుడు జనసేన, బిజెపి కూడా అందులో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాయి. ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పదవులు వస్తే ప్రాధాన్యం ఉంటుందని భావిస్తున్న నాయకులు ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ పదవుల కోసం పోటీ పడుతున్నారు. వంశధార, నారాయణపురం ప్రాజెక్టు కమిటీలకు చైర్మన్లుగా ఎన్నికయితే ప్రోటోకాల్ అమలుతో పాటు వ్యవసాయ, నీటి సలహా మండలి, జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ, జెడ్‌పి సర్వసభ్య సమావేశాలకు హాజరయ్యేందుకు అవకాశం కలుగుతుంది. దీంతో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు కూటమి నేతలు తీవ్రంగా ప్రయత్నాలు సాగిస్తున్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

విద్యుత్ ఛార్జీల పెంపుపై పోరాటాలకు సిద్ధం

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కొత్తూరు: విద్యుత్ ఛార్జీలు పెంచిన రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు పిలుపునిచ్చారు. కొత్తూరు, ఇరపాడుగూడ, గొట్టిపల్లి, హిరమండలం మండలం గులుమూరు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగకముందే రూ.15,484 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం దారుణమని అన్నారు. 2022 -23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్‌పై రూ.6072 కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నుంచి వసూలు చేయడం దారుణమన్నారు. వచ్చే నెల నుంచి 2023 -24 సర్దుబాటు ఛార్జీలు రూ.9412 కోట్లు భారం పడనుందన్నారు. ఇప్పటికే 2014-19 ట్రూ అప్ ఛార్జీలు గత నెల బిల్లులపై 40 పైసలు సర్దుబాటు చేసి వసూళ్లు చేస్తున్నారని అన్నారు. తాజాగా మూడో సర్దుబాటు ఛార్జీ బిల్లులో వేయడం సరికాదన్నారు. వచ్చే నెల 4వ సర్దుబాటు ఛార్జీ కలపటానికి రంగం సిద్ధమైందన్నారు. ఈ నెల బిల్లుల్లో 10 శాతం నుంచి 30 శాతం వరకు బిల్లులు పెరిగాయన్నారు. దీంతో నిరుపేదలపై మరింత భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉండగా, సర్దుబాటు ఛార్జీలు, అదనపు ఛార్జీలు 70 శాతం ఉండటం సమంజసం కాదన్నారు. అదానీ, జగన్, కేంద్ర ప్రభుత్వ కుంభకోణంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలన్నారు. ఈయనతో పాటు సిపిఎం నాయకులు గంగరాపు సింహచలం, సిర్ల ప్రసాద్, పల్ల కృష్ణ ఉన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యాచరణ

ఎస్‌పి మహేశ్వర రెడ్డి



స్టాఫర్లను ప్రారంభిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కార్యచరణతో, సంబంధిత విభాగాల సమన్వయంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. సిఎంఆర్, ఎస్ఆర్, సౌత్ ఇండియా షాపింగ్ మాల్ యాజమాన్యం వారి సౌజన్యంతో అందజేసిన స్టాపర్స్, రేడియం జాకెట్లు, మాస్క్, ఎల్ఇడి బ్యాటున్లను మంగళవారం ప్రారంభించి పోలీస్ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు నియంత్రణకు చర్యలు చేపట్టామని అన్నారు. కొన్ని ఇరుక రోడ్లలో ట్రాఫిక్ సమస్యలు గుర్తించామన్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారానికి ముందుకొచ్చిన యాజమాన్యాలకు అభినందనలు తెలిపారు. ఈ పరికరాలు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీస్ సిబ్బందికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లాలో నర్సన్నపేట, టెక్కలి, కాశీబుగ్గ, ఆమదాలవలస పట్టణాల్లో ట్రాఫిక్ నివారణకు ప్రత్యేక కార్యాచరణతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. శ్రీకాకుళం నగరంలో ఉదయం 8-10 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల సమయంలో ట్రాఫిక్ ఎక్కువ ఉండడం గుర్తించామన్నారు. ఆ దిశగా ఆ సమయంలో ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఇతర విభాగాలు సమన్వయంతో నియంత్రణ చర్యలు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం పట్టణ డిఎస్‌పి సిహెచ్.వివేకానంద, సిఐలు ఇమాన్యువల్‌రాజు, పైడిపు నాయడు, నాగరాజు, యాజమాన్య ప్రతినిధులు జి.వి.రమణ, వెంకటేశ్వరరెడ్డి, రమేష్, రాజేష్, సురేష్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు వేగవంతం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అనుమతులు ఉన్న రోడ్డు పనులు వేగవంతం, ముగింపు దశలో ఉన్న భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్‌సుధాకర్, పంచాయతీ రాజు ఇఇ ఎస్.రామకృష్ణ జిల్లాలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న రోడ్లు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణం పనులు వివరించారు. ఎపి రూరల్ రోడ్డు ప్రాజెక్టు 315 రోడ్డు పనులు ఉన్నాయని, అందులో 35 పనులు పూర్తి అయ్యాయని, 280 పనులు చేపడుతున్నామని అన్నారు. నాబార్డులో 25 పనులకు 25 పూర్తయ్యాయని అన్నారు. ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, సోంపేట పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలియజేశారు. సంబంధిత డిఇకి పనులు వేగవంతం కాకపోవడానికి కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. భూ సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. పాతపట్నం, జి.సిగడాం, మెళియాపుట్టి మండలాల్లోని పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణం పనులైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ పనుల పురోగతిపై సమీక్షించారు. భవనాల పూర్తికి ఇంకా కావాల్సిన నిధుల వివరాలు తెలియజేయాలన్నారు. పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎషాన్ భాషా మల్టీ విలేజ్ స్కీమ్స్ 30 ఉన్నాయని, అందులో ఉద్దానం ప్రాజెక్టులోకి 14 మల్టీ విలేజ్ స్కీమ్స్ వెళ్లిపోతాయని కలెక్టర్‌కు వివరించారు. సమీక్షలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్అండ్‌బి ఇంజినీర్లు పాల్గొన్నారు.



దళితులతో మాట్లాడుతున్న సింహాచలం, కృష్ణ

పెత్తందారులపై చర్యలు తీసుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- హిరమండలం

మండలంలోని భగీరథపురం దళితులపై దాడి చేసిన పెత్తందారులపై అట్రాసిటీ యాక్టు కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల నాయకులు పల్ల కృష్ణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు దళితులను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రెండో కార్తీక సోమవారం సందర్భంగా గ్రామంలో నిర్వహించిన అన్నదాన నిర్వహించారని అన్నారు. భోజనానికి వెళ్లిన సందర్భంగా కోన మధు, సొండి రవణమ్మలపై అగ్రకుల పెత్తందారులైన కొల్లి రవి, అతని అనుచరులు మరో నలుగురు మీరు భోజనం రావడం ఏమిటని ప్రశ్నించి కులం పేరుతో దూషించారని అన్నారు. అలాగే మధుపై దుర్భాసలాడి దాడి చేశారని పేర్కొన్నారు. వెంటనే దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాగరిక సమాజంలో అనాగరికమైన ఈ చర్యను ఖండిస్తున్నామన్నారు. పోలీసులు రాజకీయ ఒత్తిడికి లొంగకుండా దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోటబొమ్మాలి మండలం కృష్ణపురంలో, భగీరథపురంలో దళితులపై దాడి చేయడం దుర్మార్గమైన చర్యని వారన్నారు. కార్యక్రమంలో సొండి అసిరయ్య, సొండి సురేష్, కొట్నాల రాంబాబు, సొండి లక్ష్మి, సుగుణమ్మ, లతా తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని 'పల్లె పండగ' పనులు రద్దు

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పల్లె పండగలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఎంపిడిఒలు, డ్వామా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పలు మండలాల్లో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనుల్లో పురోగతి పెంచాలని ఆదేశించారు. వారం రోజుల్లో పనులు మొదలు పెట్టకపోతే కేటాయింపులు రద్దు చేసి, అవసరమైన చోట ఆ నిధులను సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. ప్రగతిలో వెనకంజలో ఉన్న పొందూరు, ఎల్ఎన్‌పేట మండలాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పనులు మొదలు పెట్టడంలో భూసేకరణ, ఇతర అడ్డంకులు తదితర అంశాలపై చర్చించారు. ఈ నెల 7లోపు పనులన్నీ మొదలు కావాలని స్పష్టం చేశారు. శనివారం నాటికి రూ.40 కోట్లు బిల్లులు చెల్లించేందుకు సిద్ధం చేశామని తెలిపారు. ప్రస్తుతం రూ.22 కోట్లకు మాత్రమే బిల్లులు వచ్చాయన్నారు. వచ్చే వారం రోజుల్లో రూ.50 కోట్లు బిల్లులు చెల్లింపులు జరిగేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ బి.సుధాకర్‌బాబు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, పంచాయతీరాజ్ శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఇ నాయుడు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్స్ డే

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఈ నెల 7న జిల్లాలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం పండగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వారపు సమావేశంలో భాగంగా జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఎంపిడిఒలతో, తహశీల్దార్లతో మంగళవారం కాన్ఫరె న్స్ ద్వారా మాట్లాడారు. మెగా పేరెంట్-టీచర్ సమావేశ నిర్వహణ ఏర్పాట్లపై మాట్లాడారు. పేరెంట్-టీచర్ సమావేశం ద్వారా విద్యార్థులను, తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయడమే ప్రభుత్వ లక్ష్యమ న్నారు. సమావేశంలో పాఠశాలల అభివృద్ధికి దోహదపడే దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులూ భాగస్వామయ్యేలా చూడాలన్నారు. పిల్లల చదువు, ప్రవర్తన, క్రమశిక్షణను తల్లిదండ్రులు తెలుసుకోవచ్చన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో డిసెంబరు నాటికి తాగునీరు, మరుగుదొడ్లు లేని కేంద్రాలు ఒక్కటీ ఉండరాదని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి సేకరణ విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, డ్వామా పీడీ బి.సుధాకర్‌బాబు, హౌసింగ్ పీడీ బి.నగేష్ పాల్గొన్నారు.



మందులను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి

ఐటిడిఎ పిఒ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దలక్ష్మీపురం ఆశ్రమ పాటశాలను పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మరుగుదొడ్లు, పరిసరాలను రోజూ పరిశీలించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పిహెచ్‌సిల సందర్శన

మెళియాపుట్టి పిహెచ్‌సిని కూడా సందర్శించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గర్భిణులకు సంబంధించిన గదులను మరమ్మతులు చేపట్టాలన్నారు. పిహెచ్‌సిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే చాపర పిహెచ్‌సిని సందర్శించారు. డెలివరీ సంఖ్యను పెంచాలన్నారు. విద్యుత్ సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు హేమంత లక్ష్మి, అలేఖ్య, పావని, ఎఒ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఖాదీ ఉద్యోగికి బెనారస్ విశ్వవిద్యాలయం ఆహ్వానం



శంకరరావు

ప్రజాశక్తి- పొందూరు

ఈ నెల 7న కాశీలోని హిందూ బెనారస్ విశ్వవిద్యాలయంలోని భారత్ కళాభవన్‌లో జరిగే ఆర్టిస్టిక్ ఇంటర్నేషనల్ ఖాదీ పుస్తక ఆవిష్కరణకు స్థానిక ఖాదీ సంస్థ ఉద్యోగి జల్లేపల్లి శంకరరావుకు ఆహ్వానం అందింది. 'డ్రీమింగ్ ఇట్ ఫార్వర్డ్' అనే పేరుతో ఈ గ్రంథం ఆవిష్కరణకు సిద్ధంగా ఉంది. దీన్ని ఉత్తరప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆవిష్కరించ నున్నారు. తానా బానా ట్రస్టు(కాశీ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ పుస్తకంలో పొందూరు సన్న ఖాదీకి సంబంధించిన వివిధ అంశాలు చోటుచేసుకోవడం గొప్ప విశేషం. శంకరరావు హిందీ, తెలుగు అనువాద కునిగా గుర్తింపు పొందారు. ఆయన కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు వివిధ కేంద్రాల్లో గతంలో నిర్వహించిన ఖాదీ హస్త కళా ప్రదర్శనలకు కార్మికులతో కలిసి హాజరయ్యారు. స్థానిక ఖాదీ సంస్థకు మూడు సార్లు విచ్చేసిన గాంధీ మనుమరాలు తారాభట్టాఛార్జికి అనువాదకునిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి.కె.ప్రసాద్, డి.వి.రమణ, సిబ్బంది, కార్మికులు, రచయిత వాండ్రంగి కొండలరావు అభినందించారు.

వికలాంగులకు సహకారం

ఎమ్మెల్యే గొండు శంకర్



ఉపకరణాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగవైకల్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొని వికలాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వికలాంగుల్లో ఎంతో ప్రతిభ కలిగి ఉంటారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ఇప్పటికే రిజర్వేషన్ శాతాన్ని పెంచారని అన్నారు. వికలాంగుల కోసం ప్రత్యేక ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లాలో రూ.75 లక్షల పరికరాలు అందజేశారని తెలిపారు. వికలాంగుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో వికలాంగుల కోసం కమ్యూనిటీ భవనాన్ని నిర్మించేందుకు కలెక్టర్‌తో చర్చిస్తానని హామీ ఇచ్చారు. ఆర్‌టిసి బస్సు పాసుల జారీలో ఉన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగులు అన్ని రంగాల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారన్నారు. లక్ష్య సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని చెప్పారు. జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా మాట్లాడుతూ వికలాంగులు ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల శాఖ ఎడి కె.కవిత, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, వికలాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి డాక్టర్ ఎం.కె.మిశ్రో, హియరింగ్ అసోషియేషన్ నుంచి ఉంగటి సురేష్, గురుదేవా ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కళ్లేపల్లి ఉషారాణి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒఎంసిఎపి, సియుఇఆర్‌ఎ పర్సనల్ విభాగాల ద్వారా నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ కోర్సులు పూర్తి చేసిన 35 ఏళ్ల వయసు గల వారు ఈ ఉద్యోగాలకు అర్హులని అన్నారు. బిఎస్‌సి నర్సింగ్ రెండేళ్లు, జిఎన్ఎం మూడేళ్ల అనుభవం కలిగి ఉండాలని సూచించారు. గుంటూరులో ఆరు నెలల పాటు జర్మన్ భాష నేర్చుకునేందుకు ఎ1, ఎ2, బి1, బి2 స్థాయిలలో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు. ఆ తర్వాత ఉద్యోగ నియామకాలు చేపడతారన్నారు. ఆసక్తిగల వారు ఒరిజినల్ (ఒడి, ఆర్ఎన్) సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. పూర్తి హాజరుతో శిక్షణ విజయవంతం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత అభ్యర్థులు జర్మనీ వీసా పొందిన అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణా కాలంలో భోజన, వసతి సౌకర్యాలు అభ్యర్థులే భరించాల్సి ఉంటుందన్నారు. బి2 పరీక్ష ఫీజు మొదటిసారిగా హాజరయ్యే సమయంలో ఫీజును అభ్యర్థులు చెల్లించాలన్నారు. వీసా అనంతరం సియుఆర్ఎ సంస్థ అభ్యర్థులకు ఫీజును తిరిగి చెల్లిస్తారని వివరించారు. ఎంపికైన అభ్యర్థుల వీసా ఫీజు, రాను, పోను విమాన టిక్కెట్లు చెల్లిస్తారన్నారు. జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.2,33,000 నుంచి రూ.3,26,000 వేతనం లభిస్తుందని వివరించారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత సర్టిఫికేట్లు, పాస్‌పోర్టు, ట్రాన్స్క్రిప్ట్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం, అనుభవ సర్టిఫికెట్, వివాహ ధ్రువీకరణ పత్రం, నోటరీ లెటర్, నర్సింగ్ కౌన్సిల్ సర్టిఫికెట్, కోవిడ్, ఎంఎంఆర్ సర్టిఫికెట్ సమర్పించాలన్నారు. ఆసక్తి గల వారు https://forms.gle/4y5NHz81btEF4xgY వెబ్ లింక్ నందు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 25 చివరి తేదీ అని తెలిపారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 99888 53335 ఫోన్ నంబరుకు సంప్రదించాలని సూచించారు.


మాట్లాడుతున్న అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ శ్రీకాంత్

క్షయ, కుష్టు నివారణకు చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్షయ, కుష్టువ్యాధి నివారణ కార్యక్రమాల్లో భాగంగా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.శ్రీకాంత్ ఆదేశించారు. మంగళవారం సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. క్షయవ్యాధి నివారణలో భాగంగా ప్రతి సచివాలయం నుంచి రోగులకు కెల్ల పరీక్షలు నిర్వహించాలన్నారు. త్వరలో ఎల్‌సిడిసి సర్వే నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి ఆశా కార్యకర్త రోజుకు ఒక సస్పెక్టెడ్ కేసును నమోదు చేయాలని ఆయన సూచించారు. ప్రతినెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించే ఆశ డే కార్యక్రమానికి ఆశా కార్యకర్తలతో పాటు వైద్య సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్, వైద్యాధికారి డా.చాందిని, సీనియర్ అసిస్టెంట్ శివకుమార్, సిహెచ్‌ఒ ఎస్తేర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్న నోడల్ అధికారి కృష్ణవేణి

చేపల పెంపకంతో గిరిజనులకు ఉపాధి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాల చెరువుల్లో చేపల పెంపకం ద్వారా ఉపాధి కల్పించడానికి చర్యలు చేపడుతున్నట్లు నోడల్ అధికారి కృష్ణవేణి తెలిపారు. మంగళవారం మండలంలోని వెన్నెలవలస గిరిజన గ్రామంలో ఉన్న ఆరు చెరువుల్లో చేపల పెంపకం చేపట్టడానికి చేప పిల్లలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్, జిల్లా మత్స్యశాఖ ఆదేశాల మేరకు 6,400 చేప పిల్లలను గిరిజనులకు అందించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మత్స్య అభివృద్ధి అధికారి బగాది సురేష్, గ్రామ మత్స్య సహాయకులు శ్రీరత్న, టిడిపి నాయకులు గిరి, టి.రాంబాబు, రామారావు, ఎస్. బుడ్డు తదితరులు పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- కవిటి

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా తమకు అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని జనసేన నాయకుడు లోల్ల రాజేష్, టిడిపి నాయకుడు బార్ల చిన్నబాబు అన్నారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్లుగా లోల్ల రాజేష్, బార్ల చిన్నబాబు మంగళవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వీరికి పలువురు కూటమి నాయకులు వీరికి శుభాకాంక్షలు తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు

ఆక్రమణపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి పంచాయతీ పరిధిలోని అయ్యప్పనగర్‌లో ఉన్న సర్వే నంబరు 466/3ఎలో ఉన్న తన జిరాయితీ భూమిని కాపాడాలని స్థల యజమాని కొత్తి మురళీకృష్ణ కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. భవానీ నగర్ రోడ్డు విస్తరణ పనులు చేపడుతుండడంతో ఇక్కడి స్థలాలకు విలువ పెరిగిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న కబ్జాదారులు తన సొంత స్థలాన్ని కబ్జా చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈడే విషయమై టెక్కలి పోలీసులకు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ విచారణ చేపడతామని హామీనిచ్చారు.


సన్మానిస్తున్న బెంతు ఒరియా ప్రతినిధులు

బెంతు ఒరియాలకు ఆదర్శనీయం

ప్రజాశక్తి- కవిటి

బెంతు ఒరియాల్లో పుట్టి, స్వశక్తితో ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, 40 ఏళ్ల ఉద్యోగ జీవితంలో రాగద్వేషాలకు అతీతంగా పనిచేసి, పంచాయతీరాజ్ జెఇగా ఉద్యోగ విరమణ చేసిన భగీరథి దళాయి తమకు ఆదర్శనీయుడని బెంతు ఒరియా పెద్దలు శివ బిసాయి, ఢిల్లీ మాస్టారు, శ్రీకాంత్ పురియా అన్నారు. పంచాయతీరాజ్ జెఇగా ఉద్యోగ విరమణ చేసిన భగీరథి దళాయిని బొరువంకకు చెందిన బెంతు ఒరియాలు సోమవారం రాత్రి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బెంతు ఒరియా పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

వికలాంగుల్లో ఆత్మస్థైర్యం నింపాలి


పొందూరు : బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ రాజారావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

వికలాంగులు కూడా సామాజిక, కుటంబ వ్యవస్థలో భాగమేనని, పలు చట్టాలు వారికి కల్పించిన హక్కులను అందరూ గౌరవించాలని డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్శిటీ ప్రత్యేక విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన 'అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం'లో పాల్గొని మాట్లాడారు. జీవితంలో శారీరక, మానసిక అవంతరాలను వికలాంగులు ఎదుర్కొంటున్నారని, వారికి చేదోడుగా ఉండాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు. జిల్లా సమగ్ర విద్యా సమన్వయకర్త బి.గోవిందరావు మాట్లాడుతూ పాశ్చత్య దేశాల కంటే వికలాంగులకు పూర్తిస్థాయిలో ఆహ్లాదకర వాతావరణం కల్పించడంలో దేశం కొద్దిగా వెనుకబడి ఉందన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా జిల్లాలో వికలాంగుల పేర్లు నమోదు చేయడం జరిగిందని, ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి సుమారు 5,900 మందికి పలు రకాల సేవలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, వర్శిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.అనురాధ, ప్రత్యేక విద్యా విభాగం సమన్వయకర్త డా.ఎన్.వి.స్వామినాయుడు, అధ్యాపకులు డి.కృష్ణారావు, కె.సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా వర్శిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన వికలాంగుల అధ్యయన కేంద్రాన్ని విసి ప్రారంభించారు. సీనియర్ అధ్యాపకుడు డా.ఎన్.వి. స్వామి నాయుడును ఈ కేంద్రానికి డైరెక్టర్‌గా నియమించడం జరిగిందన్నారు.

రణస్థలం: స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, హైస్కూల్ హెచ్‌ఎం బి.రమణయ్య, ఐఇఆర్‌పిలు ఎం.బాలరాజు, ఎం.రూపాదేవి, ఉపాధ్యాయులు దన్నాన రఘు, వికలాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక భవిత కేంద్రంలో ఎంఇఒ-2 పట్నాన రాజారావు ఆధ్వర్యంలో వికలాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసిస్టెంట్ సహిత విద్య సమన్వయకర్త ఉమాదేవి పాల్గొని వికలాంగ పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, శిక్షణ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయులు దినేష్, రాధారాణి ఎంపిపిఎస్-1, 2 హెచ్‌ఎంలు విజయ్ కుమార్, వెంకటరావు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ముత్యాలమ్మపేటలోని ఎంపిఎల్‌పి స్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ కె.అప్పారావు, ప్రధానోపాధ్యాయులు ఎన్.విశ్వనాథం, టి.శివకుమార్, ఫిజియోథెరఫీ బి.అమూల్య, సహిత ఉపాధ్యాయులు తేజేశ్వర రావు, ఎస్.సూర్యం, మహేష్, జి.అరుణ పాల్గొన్నారు.

నందిగాం : వికలాంగులకు ఆత్మస్థైర్యాన్ని నింపాలని డిటి రామారావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులు పి.రాణి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.నరసింహులు, ప్రధానోపాధ్యాయులు వె.హరిబాబు, మండల పరిషత్ ఎఒ ధనలక్ష్మి, ఫిజియోథెరపిస్టు వాసుకిరణ్, కో-ఆర్డినేటర్ వెంకటరమణ పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక భవిత కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, నిర్వాహకులు అట్టాడ మన్మథరావు, ఎం.దనుంజయ్ పాల్గొన్నారు.


ఎచ్చెర్ల : వికలాంగ విద్యార్థులతో విసి రజని


రణస్థలం : బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ త్రినాథరావు

పలాస : పలాస భవిత కేంద్రంలో నిర్వహించిన ప్రపంచ వికలాంగుల దినోత్సవంలో ఎంపిడిఒ కె.వసంతరావు, మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠరావు, ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, సిహెచ్.సత్యం, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బగాది రవిశ్రీనివాస్, సాయి కాలనీ యుపి స్కూల్ హెచ్‌ఎం బి.ప్రేమ్‌చంద్, ఎన్.ఆనంద్, టి.భారతి పాల్గొన్నారు. **కొత్తూరు :** వికలాంగులకు దుప్పట్లు, భోజనాలను లోతుగెడ్డ భగవాన్‌దాస్ నాయుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రమ్మ, ఎంఇఒ సిహెచ్.గోవిందరావు, ఎన్.శ్రీనివాస్, ఎపిఎం లలిత పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

వజ్రపుకొత్తూరు : మండలంలోని హుకుంపేటలో ఈ నెల 5న ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఆరు నుంచి పదో తరగతి వరకు చదవుతున్న విద్యార్థులు అర్హులని అన్నారు. ఈ ప్రతిభ పోటీల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 6305271092, 8464026342 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

కక్షసాధింపులు తగవు

పాతపట్నం : సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడవకముందే పేద ప్రజలపై కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టారని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒక ప్రకటనలో ఆరోపించారు. మాజీ సిఎం జగన్ ఉచితంగా పేదలకు ఇళ్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ప్రారంభించని గృహాలను కూటమి ప్రభుత్వం రద్దుకు కేబినేట్ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. అక్కతో కూటమి ప్రభుత్వం ఇటువంటి తప్పుడు నిర్ణయం తీసుకుందని విమర్శించారు. ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

పలాస : ఎపి సుడా చైర్మన్‌గా జనసేన పార్టీ నాయకులు కోరికాన రవికుమార్‌ని నియమించారని, ఈ నెల 5న ఉదయం 11 గంటలకు సుడా చైర్మన్‌గా శ్రీకాకుళం ఆనంద మయి కళ్యాణ మండపం ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేస్తున్నారని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ జనసేన పార్టీ కార్యకర్తలు, వీర మహిళలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విద్యకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో రూ.2.60 కోట్ల ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధుల అంచనా వ్యయంతో మంజూరైన ప్రహరీ, సిసి రోడ్డు నిర్మాణాల పనులకు పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తితో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం మరింత భరోసా ఇస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయ సిబ్బందికి కోరారు. నేటి విద్యార్థులే రేపటి భారత దేశ పౌరులని, వారికి ఉన్నత విద్యా విలువలో నేర్పే బాధ్యత ఉపాధ్యాయులు పైనే ఉందని అన్నారు. కార్యక్రమంలో ఐటిడిఒ ఇఇ రమాదేవి, డిఇ సిమ్మన్న, ఎఇ శ్రీకాంత్, తహశీల్దార్ పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌గౌడ, మాజీ ఎంపిపి ఎస్.మోహనరావు, బి.లలితకుమారి పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, పిఒ


మాట్లాడుతున్న చంద్రమోహన్

రేపు సుడా చైర్మన్ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ చైర్మన్‌గా కోరికాన రవికుమార్ ఈ నెల 5న బాధ్యతలు స్వీకరిస్తున్నారని, ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు తరలి రావాలని జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ పిలుపు నిచ్చారు. మంగళవారం నగరంలోని జనసేన జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు పూర్తి కావస్తోందని, సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు సమిష్టిగా శ్రమిస్తున్నారన్నారు. మరోవైపు యువతకు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు శ్రమిస్తున్నారన్నారు. నగరంలో ఆనందమయి ఫంక్షన్ హాల్‌లో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు హాజరు కానున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, నగర జనసేన నాయకులు పాండ్రంకి రాజేష్ నాయుడు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

పులి దాడిలో ఆవు దూడ మృతి

పాతపట్నం : మండలంలోని తీమర గ్రామ సమీపంలో ఆవు దూడపై పులి దాడి చేసి చంపేసింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన జరిగి రెండు రోజులు అవుతుందని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. సమాచారం అందుకున్న సంఘటన స్థలానికి ఫారెస్టు రేంజర్ అమ్మన్నాయుడు, మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు పులికి సంబంధించిన పాదముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులి అడుగులు రొంపివలస నుంచి కొరసవాడ వైపుగా ఒడిశా వైపు వెళ్లినట్లు గుర్తించామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో ఇటు వైపు, పొలాలకు వెళ్లరాదని సూచించారు. ఈయనతో పాటు ఫారెస్టు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


మృతి చెందిన దూడలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వన్యమృగాల దాడిలో దూడల మృతి

పలాస : మండలంలోని చిన్ననీలావతిలో సోమవారం రాత్రి వన్యమృగాల దాడిలో అదే గ్రామానికి చెందిన పాతిన త్రినాథ్‌కు చెందిన రెండు దూడలు మృతి చెందాయి. గ్రామ సమీపంలోని తోటలో డెయిరీ ఫారం నడుపుతున్నాడు. అందులో భాగంగా రెండు దూడలను తోటలో చెట్లు కట్టి ఇంటికి వెళ్లిపోయాడు. రోజులా మంగళవారం ఉదయం ఐదు గంటల సమయంలో తోటకు వెళ్లేసరికి దూడలు మృత్యువాత పడి ఉన్నాయి. దీంతో పాడి రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. సుమారు రూ.పది వేలు విలువ ఉంటుందని పాడి రైతు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులతో పాటు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కాశీబుగ్గ అటవీ శాఖ రేంజర్ మురళీకృష్ణ తన బృందంతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సమీప ప్రాంతంలో జంతువు కాలి పాదముద్రలను పరిశీలించారు. బొడ్డపాడు పశు వైద్యాధికారి మధుబాబు దూడలకు పోస్టుమార్టం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఉద్యోగికి గాయాలు

ఆమదాలవలస: పురపాలక సంఘం పరిధిలోని 23వ వార్డు లక్ష్మడుపేట కూడలి వద్ద మంగళవారం లారీ ఢీకొట్టిన సంఘటనలో సచివాలయ ఉద్యోగికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు బూర్జ మండలం ఒవిపేటలో సచివాలయ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీకాకుళం రూరల్ మండలం రాగోలుకు చెందిన పొన్నాడ త్రినాథరావు విధులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో ఆమదాలవలస వైపు నుంచి పాలకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో త్రినాథరావుకు చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.


నాటుసారాతో మహిళ అరెస్టు

కంచిలి : మండలంలోని ఎస్‌సిఆర్‌సి పురం సమీపంలో 150 నాటసారా ప్యాకెట్లతో మహిలను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కె.బేబి తెలిపారు. నాటుసారాను అరికట్టేందుకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని అన్నారు. నాటుసారా రవాణా, విక్రయాలపై సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

సచివాలయంలో ఎంపిటిసి భర్త హల్‌చల్

కంప్యూటర్ పగలగొట్టి విఆర్‌ఒపై దాడి

పొందూరు: మండలం తోలాపిలో మంగళవారం మధ్యాహ్నం సచివాల యంలో అకస్మాత్తుగా ఎంపిటిసి భర్త రామినాయుడు హల్‌చల్ చేసి కంప్యూటర్‌ను పగలగొట్టి అక్కడ ఉన్న విఆర్‌ఒపై దాడి చేశారు. మంగళవారం మధ్యాహ్న సమయంలో కార్యాల యానికి వచ్చిన రామినాయుడు సచివాలయంలో కొంతసేపు కూర్చొని ఉన్నాడు. ఆ సమయంలో విఆర్‌ఒ ఎం.దివాకర్ (రేవతిరావు)తో పాటు డిజిటల్ అసిస్టెంట్ కార్యాలయంలో ఉన్నారు. మిగిలిన సిబ్బంది విది నిర్వహణపై బయటకు వెళ్లారు. ఆ సమయంలో ఎంపిటిసి భర్త ఒక్కసారిగా కార్యాలయంలో ఉన్న కంప్యూటర్‌ను నేలకు కొట్టి ధ్వంసం చేశారు. అనంతరం ఇటీవల డిప్యూటే షన్‌పై వచ్చిన విఆర్‌ఒ రేవతిరావుపైనా దాడి చేసి మెడపట్టి తోసేయడంతో ఒక్కసారిగా విఆర్‌ఒ తూలి పడ్డారు. ఆ సమయంలో అక్కడే ఉన్న పంచాయతీ ఉపసర్పంచ్ పప్పల శ్రీనివాసరావు రామినాయుడు నుంచి విఆర్‌ఒను విడదీశాడు. సిబ్బందిపై దౌర్జన్యం చేయడం సరికాదని రామినాయుడును బయటకు పంపించాడు. విఆర్‌ఒ రేవతిరావుకు మండలంలో వివాద రహితుడు సౌమ్యుడనే పేరుంది. జరిగిన సంఘటనతో విఆర్‌ఒ విషయాన్ని కార్యదర్శి కూన వినోద్‌కు తెలియ జేయడంతో బయట విధుల్లో ఉన్న ఆయన కార్యాలయానికి వచ్చి పరిస్థితిని ఎంపిడిఒ మన్మథరావు, ఇఒపిఆర్‌డి సింహాచలంకు తెలిపారు. విషయాన్ని రేవతిరావు తహశీల్దార్ వెంకటేష్ రామానుజన్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే పొందూరు కార్యాల యానికి వచ్చేయాలని సూచించారు. విషయాన్ని మండల అధికారులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.


దాడిలో ధ్వంసమైన కంప్యూటర్

వ్యాధిగ్రస్తులకు పింఛను ఇవ్వాలి


గణపతి

సోంపేట : నిరుపేదలైన దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వయసుతో సంబంధం లేకుండా పింఛను ఇవ్వాలని కొర్లాం జాగృతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి ఒక ప్రకటనలో కోరారు. సిఎం, డిప్యూటీ సిఎంలకు ఇటీవల లేఖర రాశానని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన బోదకాలు, పక్షవాతంతో బాధపడుతున్న వారికి పింఛను ఇస్తే వారికి ఆదుకున్నట్లు అవుతుందన్నారు. దీనిపై పరిశీలన చేసి నిరుపేదలకు తోడ్పాటు అందించాలని కోరారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

కొత్తూరు: ఇటీవల పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని పిఎసిఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు ఇచ్చే ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు పొడిచిందన్నారు. సమావేశంలో మహర్తాపురం మాజీ సర్పంచ్ నాస బాలకృష్ణ, నీలకంఠాపురం మాజీ సర్పంచ్ తిర్లంగి కృష్ణమోహన్, పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ భాగ్యలక్ష్మి

చేపల వ్యాధులపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో చేపలు, రొయ్యల్లో వచ్చే వ్యాధుల నిర్ధారణపై మత్స్యశాఖ విస్తరణాధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ ఆర్థిక సహకారంతో ఈ శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ చేపల పెంపకాన్ని శాస్త్రీయ విధానంలో చేపడితే అధిక లాభాలు పొందవచ్చునన్నారు. జిల్లాలో ఉన్న నీటి వనరులను సమగ్రంగా ఉపయోగించుకొని నూతన పద్ధతులను అవలంభించాలన్నారు. శిక్షణలో భాగంగా మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ చేపల్లో వచ్చే వ్యాధులను గుర్తించడం చాలా కీలకమని, వ్యాధి నిర్ధారణ పద్ధతులను విస్తరణాధికారులకు వివరించారు. క్షేత్రస్థాయిలో వ్యాధి నిర్ధారణ యాజమాన్య పద్ధతులపై అవగాహన ఉన్నప్పుడు రైతులకు నాణ్యమైన సేవలు అందించవచ్చునని తెలిపారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం సాగులో ఉన్న చేపల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, మత్స్యశాఖ ద్వారా నిర్వహిస్తున్న ప్రయోగశాలలో నీటి నమూనాలను పరిశీలించడం ద్వారా వ్యాధి నిర్ధారణ జరుగుతుందని, ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు జిఎస్ రాయి, సునీత, హరికుమార్, కిరణ్, అనూషా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన


రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లాలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి, స్థానిక వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిభిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా వైశ్య సంఘం అధ్యక్షుడు వూన కృష్ణమోహన్ మాట్లాడుతూ రక్త దానం చేయడం ద్వారా ఎంతో మందికి ప్రాణాలు కాపాడుతుందని చెప్పారు. వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ యజమాని జామి తిరుపతి ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎంతో మందికి సులువుగా వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం జరిగే వైద్య శిబిరంలో 417 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 26 మందికి మెరుగైన వైద్యం కోసం ఎంపిక చేశారు. అలాగే 35 మంది రక్తదానం చేశారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జామి రామ్‌జీ, ఎంపిటిసి మాజీ సభ్యులు దంతం వైకుంఠరావు, ఆళ్ల కృష్ణారావు, జెమ్స్ మేనేజర్ చిన్నారావు, ఏరియా మేనేజరు తిరుపతి, ప్రదీపు పాల్గొన్నారు.

గుమ్మడాంలో రహ'దారుణా'లు


బురదమయంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుమ్మడాం పేరుకే పంచాయతీ. అక్కడ సమస్యలు మాత్రం కోకొల్లలు. ప్రభుత్వాలు, పాలకులు మారినా గ్రామ పరిస్థితి మాత్రం మారలేదు. చినుకు పడితే గ్రామంలోని వీధుల్లో రోడ్లు బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేక పోతుందని, నరకయాతన అనుభవిస్తున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బొంతుపేట, రావాడ వెళ్లే మెయిన్ రోడ్డు వరకు దమ్ముమడి మాదిరిగా మారిపోయింది. ప్రభుత్వం మారినా, పాలకులు మారినా గ్రామంలో మౌలిక సదుపాయలు కూడా కల్పించలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామంలో సిసి రోడ్లు, కాలువలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు

సోంపేట : స్థానిక సామాజిక ప్రభుత్వాస్పత్రిలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు టి.వెంకటేష్, సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.రాము పర్యవేక్షణలో వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వ్యాధిగ్రస్తుల బంధువులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ బి.లతాశ్రీ, ల్యాబ్ టెక్నీషియన్ శివప్రసాద్, న్యాయవాదులు ఎం.ధర్మారావు, శోభాదేవి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: కిడ్నీ వ్యాధిగ్రస్తులు సకాలంలో చికిత్స చేయించాలని మెజిస్ట్రేట్, మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ పి.పరేష్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో మంగళవారం వైద్య శిబిరంతో పాటు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కిడ్నీ రోగులకు అందుతున్న డయాలసిస్ తీరు తెన్నులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంకా కిడ్నీ వ్యాధులు బారిన పడిన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కొత్తగా నిర్మిస్తున్న డయాలసిస్ కేంద్రం పరిశీలించారు. కార్యక్రమంలో నెఫ్రోలిజిస్టు డాక్టర్ సత్య డోలు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవేంద్రరెడ్డి, డాక్టర్ రమ్య, డాక్టర్ కళ్యాణి, బార్ అసోసియేషన్ సభ్యులు రమణయ్యరెడ్డి, సీతయ్యరెడ్డి, ప్రసాద్, రంగారావు, కృష్ణమూర్తిరెడ్డి, మనోజ్, కామేష్, ప్రేమలత పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న పరేష్‌కుమార్

పలాస : కిడ్నీ ఆస్పత్రిలో అందిస్తున్న సేవలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు.మాధురి అన్నారు. ఈ మేరకు వైఎస్‌ఆర్ కిడ్నీ ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అల్లు పద్మజ, నెఫ్రాలజీ వైద్యులు రాకేష్, బార్ అసోసియేషన్ సెక్రెటరీ పిండి వెంకటరావు, జాయింట్ సెక్రెటరీ అనిల్ రాజు, ఉపాధ్యక్షుడు ఫయాడ్ అహ్మద్, న్యాయవాదులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పాత్రికేయుల పాత్ర కీలకం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజాభివృద్ధిలో పాత్రికేయులు అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డైరీని సోమవారం ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ నిరంతరం ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పాత్రికేయులు పని చేస్తున్నారన్నారు. పత్రికలు ప్రజాస్వామ్య సౌధానికి మూలస్తంభం లాంటివన్నారు. అందుకే పత్రికలను ఫోర్త్ ఎస్టేట్‌లో భాగంగా పేర్కొంటారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గంజి ఆర్ ఎజ్రా, ఉపాధ్యక్షులు పిన్నింటి అప్పన్న, ప్రధాన కార్యదర్శి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

ఘనంగా రాజేంద్ర ప్రసాద్ జయంతి

ప్రజాశక్తి- లావేరు

లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి తొలి రాష్ట్రపతిగా అత్యున్నత పదవిని చేపట్టి పదేళ్లపాటు భారత తొలి పౌరుడిగా మహోన్నత సేవలందించిన బాబు రాజేంద్రప్రసాద్ 1884 డిసెంబర్ 3న జన్మించారన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని లొద్దపుట్టిలో మంగళవారం నిర్వహించిన ఉచిత కేన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం విజయవంతమైంది. సీడాప్ మాజీ చైర్మన్ పాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, దాలయ్యరెడ్డి ఆధ్వర్యాన మహాత్మగాంధీ కేన్సర్ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరం లో మహిళలకు గర్భాశయ, రొమ్ము, పురుషులకు నోటి కేన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ఆశి దాలయ్యరెడ్డి, ఆనంద్, నాగరాజు, తేజ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న ప్రేమ్‌కుమార్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజావక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తిప్పనాపుట్టుగకు చెందిన తిప్పన అన్నపూర్ణ భర్త నారాయణ వృత్తి రీత్యా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ... అనారోగ్యంతో మంచాన పడ్డారు. దీంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. విషయం తెలుసుకున్న నరేంద్ర సేన యువత రూ.పది వేలు, నర్తు ప్రేమ్‌కుమార్ రూ.పది వేలు చొప్పున మంగళవారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని ఈడుపురం పిహెచ్‌సి సిబ్బందిని ప్రేమ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పన దాలయ్యరెడ్డి, రత్నాల తారకేశ్వరరావు, కామేష్, మజ్జి దేవ్ పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎయిడ్స్‌పై అప్రమత్తం

ఆమదాలవలస: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉషా పద్మిని అన్నారు. మంగళవారం ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని అరికట్టాలంటే యువత పాత్ర చాలా ముఖ్యమన్నారు. సోషల్ మీడియా విస్తరిస్తున్న నేటి కాలంలో విద్యార్థులు ఇటువంటి వాటిపై అవగాహన కలిగి, తమను తాము కాపాడు కోవడంతో పాటు గ్రామాల్లో ప్రజలను చైతన్య పర్చడం అవసరమన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఎచ్చెర్ల: జాతీయ స్థాయి అండర్- 19 కబడ్డీ స్కూల్‌గేమ్స్ హర్యానాలోని భీవానిలో 7 నుంచి 11 వరకు జరగనున్న టోర్నమెంట్‌కు ఎపి బాలికల జట్టుకు కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని గురుగుబెల్లి వైష్ణవి ఎంపికైనట్టు ఎస్‌జిఎఫ్ అధ్యక్షులు, డిఇఒ తిరుమల చైతన్య, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ బి.వి రమణ తెలిపారు. ఈ విద్యార్థిని హెచ్‌ఎం బి.వి సాయిరాం, పీడీ ఎం.వి.రమణ, పిఇటి మల్లేష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

స్వయం సమృద్ధి సాధించాలి



లావేరు : మాట్లాడుతున్న సిడిపిఒ ఝాన్సీరాణి

ప్రజాశక్తి- లావేరు

ప్రతి మహిళా స్వయం సంవృద్ధి సాధించుకోవాలని రణస్థలం ఐసిడిఎస్ పిఒ ఝాన్సీబాయి అన్నారు. మంగళవారం లావేరు మండల పరిషత్ సమావేశం మందిరంలో కిశోరి వికాసం పథకం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడి మానేసిన 11 ఏళ్ల నుంచి 18 ఏళ లోపు బాలికలకు విద్య, ఆరోగ్యం, న్యూట్రిసిన్, హ్యూమన్ ట్రాఫికింగ్, బాల్య వివాహాలతో అనర్థాలు, పోక్సోచట్టంపై గ్రామాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు, ఎఎన్‌ఎంలు అవగాహన కల్పించాలన్నారు. జీవనోపాధిపై స్వయం సంవృద్ధి ఎలా సాధించాలన్న విషయాలను గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి విశ్వేశ్వరరావు, ఎంఇఒలు వాగ్దేవి, ఎం.మురళీకృష్ణ, వైద్యాధికారి మణిభూషన్, ఎస్ఐ లక్ష్మణరావు, ఇఒ ఉష, రిసోర్స్‌పర్సన్స్ పూజారి గోవిందరావు, ఎన్.లక్ష్మణరావు, ఎ.గీత, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బూర్జ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ పిఒ గీతారాణి ఆధ్వర్యంలో మండలస్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు, విజయలక్ష్మి , ఎస్ఐ ప్రవల్లిక, ఎంఇఒ ధనుంజయరావు, సింహాచలం, కమ్యూనిటీ హెల్త్ అధికారి సిహెచ్ అప్పలస్వామి, ఎఎన్‌ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: గుజరాతి పేటలోని ఐసిడిఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం-2 కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. కిశోరి వికాసం పోస్టర్లను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శాంతి, పిఒ శోభారాణి, టిడిపి నాయకులు అందవరపు సంతోష్, మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

కొత్తూరు : మండల పరిషత్ కార్యాలయంలో కిశోర వికాసంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సవర సావిత్రి, ఎంపిడిఒ నీరజ, ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, ఇఒపిఆర్‌డి వసంతకుమారి, వైద్యులు పి.ప్రసన్నకుమార్, సూపర్‌వైజర్లు లింగాల శాంత కుమారి, బి.సుధారాణి, ఎం.ఈశ్వరి, గౌస్య బేగం పాల్గొన్నారు.



బూర్జ : మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుపతిరావు

మెళియాపుట్టి: స్థానిక వెలుగు కార్యాలయంలో కిశోర వికాసంపై పాతపట్నం ఐసిడిఎస్ ప్రజాజెక్టు అదికారి విమలారాణి అధ్యక్షతన మంగళవారం మండలస్థాయి శిక్షణా కార్యక్రమం ఇనర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా పాల్గొని మాట్లాడారు. బాల్యవివాహాలు చేయరాదని అన్నారు. స్థానిక వైద్యాధికారి అలేఖ్య మాట్లాడుతూ రక్త హీనత కిశోరి బాలికలు నివారించాలన్నారు. సెల్ ఫోన్లు కలిగే ప్రభావాలు, మోసాలను వివరించారు కార్యక్రమంలో ఎన్‌జిఒ ప్రతినిధి ప్రసాద్, బ్రేడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి పోలయ్య, ఎపిఎం త్రినాథమ్మ, నళినీకుమారి, టి.కామేశ్వరరావు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, అమరావతి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి- కవిటి

వాతావరణం పూర్తిగా తేరుకునే వరకు రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని మండల ఎఒ బడగల దుర్గాప్రసాద్ సూచించారు. మండలంలోని మాణిక్యపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజుల వర్షాలకు నేలకొరిగిన పంట శుభ్రం చేసుకునేందుకు, పొలంలో నీటిని మళ్లించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మండలంలో బొరివంక, కవిటి, కపాసుకుద్ది, కరాపాడు గ్రామాల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రబీ పంటకు అనుకూలమైన పెసలు, రాగులు, మినుములు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన విత్తన రైతులు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు అన్వేష్, ఉప సర్పంచ్ దేవరాజ్ సాహు, నెయ్యిల చింత, మురళి బిసాయి, పిన్నింటి శ్రీనివాస్, కణితి వెంకటరమణ, బేధాబర సాహు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒ దుర్గాప్రసాద్

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి, మున్సిపాలిటీ పరిధిలోని పురుషోతపురం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు, ఎఒ భార్గవి రైతులకు రబీకి అనుకూలమైన పంటలు, వాటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు.

సోంపేట : మండలంలోని మూలపొలం, రాజాం గ్రామాల్లో ఎఒ నరసింహమూర్తి ఆధ్వర్యాన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వంద రోజుల యాక్షన్ ప్లాన్ సవరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యాశాఖ విడుదల చేసిన పదవ తరగతి పరీక్షల 100 రోజుల యాక్షన్ ప్లాన్ అశాస్త్రీయంగా, అసంబద్ధంగా ఉందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మధన్మోహన్, ఎస్.వి.అనిల్ కుమార్ ఒక ప్రకటన పేర్కొన్నారు. ఇటువంటి నిర్ణయం విద్యాభివృద్ధికి ఏమాత్రం దోహదకారి కాదన్నారు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెంచే విధంగా నిర్ణయాలు సరికాదన్నారు. ఒత్తిడితో కూడిన చదువులు నష్టదాయకమని, కార్పొరేట్ వ్యవస్థలో ఎదురవుతున్న గుణపాఠాలు తీసుకోకుండా అదే విధానాలను అమలు చేయడం తగదన్నారు. ప్రతిరోజు స్లిప్ టెస్టు నిర్వహించాలన్న నిర్ణయం సరికాదన్నారు. ఇప్పటికే 10వ తరగతి పరీక్షల ప్రిపరేషన్ కోసం హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వారి వారి పాఠశాల అనుకూలతను విద్యార్థుల సంసిద్ధతను దృష్టిలో పెట్టుకొని ఉదయం ఒక గంట సాయంత్రం ఒక గంట రెమిడీయల్ తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారని, ఉపాధ్యాయులే స్వచ్ఛందంగా విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారని గుర్తు చేశారు. ఈ నిర్ణయాలన్ని ఉపసంహరించు కోవాలన్నారు.

పొందూరు: పదవతరగతి వంద రోజుల కార్యాచరణలో ప్రతి ఆదివారం క్లాసులు నిర్వహించాలని, సంక్రాంతి సెలవుల పండగ మూడు రోజులు తప్ప మిగిలిన అన్ని రోజులు క్లాసులు నిర్వహించాలని ఆదేశించడాన్ని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు ఒక ప్రకటనలో ఖండించారు. ఈ రకమైన ఆదేశాలు శాస్త్రీయంగా లేవని, ఇది విద్యార్థులను, ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సెలవు రోజుల్లో స్టడీ అవర్స్ నుంచి మినహాయింపు ఇవ్వాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

సమాచారం అందిస్తే ప్రోత్సాహకాలు



రణస్థలం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అమ్మోజీ

ప్రజాశక్తి- రణస్థలం

తమ పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సమాచారం అందిస్తే, వివరాలు గోప్యంగా ఉంచి తగిన ప్రోత్సాహకాలు అందిస్తామని కోష్ట సచివాలయం మహిళా పోలీస్ బమ్మిడి అమ్మోజీ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జె.ఆర్.పురం స్టేషన్ పరిధిలో సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి పర్యవేక్షణలో కోష్ట పంచాయతీ సక్సెస్ స్కూల్‌లో 'సంకల్పం' కార్యక్రమం నిర్వహించారు. ఇంట్లో ఒక్కరు వ్యసనానికి బానిస అయినా ఇంటిల్లిపాదికీ ఎంతో నష్టం వాటిల్లుతుందని, దాన్ని పూర్తిగా నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాల అనర్థాలను తెలియజేస్తూ ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కరిమజ్జి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మాదకద్రవ్యాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సిఐ పి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం పురపాలక సంఘంలోని 13వ వార్డు పరిధిలోని కొత్తకోట వారి వీధిలోని బిసి వెల్ఫేర్ హాస్టల్ వద్ద ఎస్‌పి ఆదేశాల మేరకు సంకల్పం పేరిట మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తుకు అలవాటు పడితే జీవితం చిత్తు అవుతుందని అటువంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ సత్యనారాయణ



పరామర్శిస్తున్న రామ్ మల్లిక్ నాయుడు

రామ్‌మల్లిక్ పరామర్శ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని చెట్టిపొదిలంకు చెందిన టిడిపి నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ భూపతి శ్రీరామ్ మూర్తి ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో టిడిపి యువనాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు. మంగళవారం పరామ ర్శించారు. ఈయనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు కుమరాపు రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందీ ధ్రువపత్రాలు అందజేత

ప్రజాశక్తి- పాతపట్నం

స్థానిక శాఖాగ్రంథాలయంలో బాలా త్రిపుర సుందరి ట్యూషన్స్ ఆధ్వర్యాన హిందీ రాష్ట్ర భాష ప్రసార సభ ప్రాథమిక పరీక్ష నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన 20 మంది విద్యార్థులకు ఎస్ఐ బి.లావణ్య ధ్రువపత్రాలు, మెమోంటోలను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కాళ్ల రాజు, కార్యక్రమంలో రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు పారసెల్లి రామరాజు, అమర జ్యోతి స్కూల్ ఉపాధ్యాయులు ఇప్పిలి మురళీకృష్ణ, ఎస్.వి.బేబీ, శ్రీనివాస టైప్ ఇనిస్ట్యూట్ ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎల్.ఎస్.దాస్ పాల్గొన్నారు.

లక్ష్మణకుమార్‌కు సన్మానం

పలాస : మండలంలోని గురుదాసుపురంలో అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డెరెక్టర్‌గా ఎంపికైన కుత్తుం లక్ష్మణకుమార్‌కు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, గర్తం తులసీరావు, మామిడి అప్పారావు, మామిడి కమలమ్మ, సార జోగారావు తదితరులు పాల్గొన్నారు.



అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

విద్యార్థినికి అభినందనలు

పోలాకి: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి చూపడం అభినందనీయమని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అన్నారు. ఎపి మోడల్ స్కూల్‌లో ఫెన్సింగ్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో మెడల్ సాధించిన కె.చందు అనే విద్యార్థినికి మంగళవారం అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీడీ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు మళ్లీ వాయిదా

లావేరు: మండలంలోని 13 సాగునీటి సంఘాలకు ఎన్నికలు మళ్లీ వాయిదా పడినట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. ఈ నెల 8న ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధంకాగా గత నెలలో ఎన్నికలకు ప్రభుత్వం ప్రకటన ఇవ్వగా అసెంబ్లీ సమావేశాలు కారణంగా ఎమ్మెల్యే నియోజకవర్గాల్లో లేకుండా ఎన్నికలు నిర్వహించడం మంచిది కాదని ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా డిసెంబర్ 8న ఎన్నికలు నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధం కాగా మళ్లీ భారీ వర్షాలు కారణంగా వాయిదా పడినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక తెలియజేయడం జరుగుతుందని ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు గమనించాలన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి తహశీల్దార్ కె.రవిచంద్ర, ఎంఇఒ సిహెచ్.గోవిందరావు, హెచ్‌ఎం ఎ.గోవిందరావు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కెజిబివి ఉన్నత పాఠశాలలో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించారు అందులో భాగంగా 186 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 80 మంది వివిధ పోస్టులకు ఒక్కో దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో హెడ్ కుక్కు, అసిస్టెంట్ కుక్కు స్కావెంజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధి రత్తకన్న హైస్కూల్ ఆవరణంలో యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, న్యాయవాది ఎం.రాంబాబు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి.పావనికుమారి, ఉపాధ్యాయులు రవీంద్రబాబు, న్యాయవాదులు సీతయ్య, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, ధర్మవరపు తులసీరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిమబిందు

ప్రవర్తన బట్టే వ్యక్తిత్వం

టెక్కలి : విద్యార్థి దశలో చేపడుతున్న పనులు ఆలోచనల బట్టే మన భవిష్యత్ జీవితం, మన ప్రవర్తన ఆధారపడి ఉంటుందని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అన్నారు. కళాశాలలో మంగళవారం నిర్వహించినఉమెన్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒన్‌స్టాఫ్ సెంటర్ నిర్వాహకులు హిమబిందు మాట్లాడుతూ యువత తొందరపాటుతో తీసుకున్న నిర్ణయాలు వల్ల భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. కౌన్సెలర్ నిర్మల గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, కో-ఆర్డినేటర్ లూక్‌పాల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పాతపట్నం

రాష్ట్రీయ బాల సంరక్ష కార్యక్రమంలో భాగంగా పాతపట్నం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం గొంగువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివ విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. సకాలంలో పౌష్టికాహారమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 770 మంది విద్యార్థులకు ఎత్తు, బరువు, రక్త పరీక్షలు, చర్మ పరీక్షలు, సహస వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు వద్దు

ప్రజాశక్తి- మందస

పలాస అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల సముద్రతీర ప్రాంతాల్లోని గ్రీన్‌ఫీల్డ్ కార్గో ఎయిర్ పోర్టు నిర్మిస్తే ఉద్దాన ప్రాంతం నాశనమవుతుందని ప్రజా సంఘాల నాయకులు సిహెచ్.వేణుగోపాల్, ఎస్.నారాయణస్వామి, పి.ఆరేలమ్మ, కొన్న శ్రీనివాసరావు, సిహెచ్.రవి అన్నారు. ఉద్దాన తీర ప్రాంత భూ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కొమర వాసు అధ్యక్షతన రాంపురం, భేతాళపురం, చీపురుపల్లి పంచాయతీలోని గ్రామాల రైతులకు మంగళవారం సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో గున్నయ్య, ఎన్.పరుశురాం, మర్ల సంతోష్, డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్ పాల్గొన్నారు.

'కోల' మృతిపై సంతాపం

టెక్కలి రూరల్ : ఉద్యమ నాయకులు కోళ్ల పాపారావు ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పాపారావు మృతికి మంగళవారం సంతాపం తెలిపారు. పాపారావు సోదరి, కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ముందుగా పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళ్లర్పిస్తున్న నాయకులు

నాటుసారా స్వాధీనం

పాతపట్నం : మండలంలోని రామన్నగూడలో కొత్తూరు మండలం మగ్రిపాడుకు చెందిన వ్యక్తి నుంచి 15 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నామని ఎక్సైజ్ సిఐ కోట కృష్ణారావు తెలిపారు. ఆయనను అరెస్టు చేసి చేశామన్నారు. కోడూరు గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి 8, ప్రహరాజపాలెంకు చెందిన వ్యక్తి నుంచి ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

మాయమవుతున్న రోడ్డు క్రాస్ బేరియర్స్

పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- లావేరు

రణస్థలం నుంచి రాజాం వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు ప్రక్కన ప్రమాదాల నివారణకు అల్యూమినియం రేకుతో వేసిన క్రాస్ బేరియర్స్ రోజురోజుకు మాయం అవుతున్నా ఆర్‌అండ్‌బి అధికారులు కనీసం పట్టించు కొకపోవడంతో లక్షలు విలువ గల రేకులు దొంగలు దోచుకెళ్లాతున్నారు. సీతంవలస, కేశవరాయపురం గ్రామాల మధ్యలో ఉన్న సీతంవలస గ్రామం పరిధిలోని పచ్చలమ్మ చెరువు వద్ద రోడ్డు నిర్మాణం సమయంలో రహదారి గుండా వెళ్లినప్పుడు వాహనాలు ప్రమాదాలు జరిగితే అదుపు తప్పి చెరువులోకి దూసుకుపోకుండా ఉండేందుకు రోడ్డు, చెరువుకు మధ్యలో 200 మీటర్లు పైబడి రక్షణగా అల్యూమినియం రేకుతో క్రేస్ బేరియర్స్ వేశారు. కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో వాటిని తొలగించి భారీ వాహనాల్లో ఎత్తుకుపోతున్నారు. ఇటీవల 100 మీటర్లు మేర బోల్టు తొలగించి రేకును విప్పి కింద దించేశారు. దాన్ని ఏదో రాత్రి మాయం చేసేందుకు ప్రణాళికను రచించు కున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు ఆ ప్రదేశాన్ని చూసి ఇప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాహనదారులు పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి, పోలీసులు స్పందించి దొంగల పాలవ్వకుండా చర్యలు తీసు కోవాలని, ఉన్నవాటిని దొంగల పాలవ్వకుండా చూడాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.



ఎత్తుకువెళ్లేందుకు తొలగించిన అల్యూమినియం రేకు

ఎమ్మెల్సీ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని లావేరు, బెజ్జిపురం, వెంకటాపురం, మురపాక, తామాడ, అదపాక, కేశవరాయుపేట, అల్లినగరం ఉన్నత పాఠశాలలను ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ మంగళవారం సందర్శించారు. ఈ మేరకు అల్లినగరం, అదనపాక పాఠశాలల్లో ఉపాధ్యాయులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, వండాన జగదీష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మీసాల శ్రీనివాసరావు, పైడి శ్రీరామ్మూర్తి, నాగరాజు, కామేశ్వరరావు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ